క్లుప్తంగా

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక అమ్మనాన్న మదర్ థెరిస్సా వృద్ధాశ్రమం, వికాస్ విహార్ దివ్యాంగుల పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు షాకీర్ హుసేన్ మాట్లాడుతూ లక్ష్మీపావని కుమారుడు జి.మోక్షిత్ పుట్టిన రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నూతన నియామకం

ప్రొద్దుటూరు : బీజేపీ ప్రొద్దుటూరు అసెంబ్లీ కోకన్వీనర్‌గా వర్లపాడు గౌరీశంకర్‌ను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ ప్రదీప్ రెడ్డిని శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 15 ఏళ్లుగా బీజేపీకి చేసిన సేవలను గుర్తించి తనకు ఈ పదవి ఇచ్చారని ఆయన తెలిపారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : మండలంలోని మడూరు పంచాయతీ చిన్నవరదాయపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డా. రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య శిబిరం నిర్వహించి అన్ని రకాలైన పరీక్షలు చేసి మందులను పంపిణీ చేయటం జరుగుతుందన్నారు.

బద్వేలు అసెంబ్లీ బీజేపీ కో కన్వీనర్‌గా పండరి

పోరుమామిళ్ల : బద్వేలు అసెంబ్లీ బీజేపీ కో కన్వీనర్‌గా పోరుమామిళ్లకు చెందిన పల్లెంశెట్టి పండరి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి అందించారు. ఈ సందర్భంగా పండరి మాట్లాడుతూ 16 సంవత్సరాలుగా బీజేపీలో కార్యకర్తస్థాయి నుంచి జిల్లా నాయకుడిగా సేవలందించానన్నారు.

ఏబీవీపీ నగర నూతన కమిటీ

పోరుమామిళ్ల : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పోరుమామిళ్ల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏబీవీపీ నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగర కార్యదర్శిగా ప్రసాద్, సహ కార్యదర్శులుగా నందు, కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్‌గా రోహిత్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా కార్తీక్, ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్‌గా నాయబ్ రసూల్, కార్యవర్గ సభ్యులుగా వెంకటేష్, సింగరయ్య, సింహాద్రి, ధర్మలతో సహా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏబీవీపీ అధ్యక్షులుగా నవీన్, అఖిల్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘటనామంత్రి పెంచలయ్య, జిల్లా కన్వీనర్ అభిలాష్‌లు పాల్గొన్నారు.

రేపు బ్యాడ్మింటన్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జార్జికారొనేషన్ క్లబ్‌లోని వర్రా గురివిరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఉదయం 9 గంటలకు బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నట్లు క్లబ్ సెక్రటరీ గంగిరెడ్డి, కోచ్ అనిల్ ఒక ప్రకటనలో తెలిపారు. మెన్స్ డబుల్ విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. ప్రథమ బహుమతి రూ.5000, ద్వితీయ బహుమతి రూ.3000, తృతీయ, చతుర్థి బహుమతి రూ.1500 అందిస్తామని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 83282 65835 సంప్రదించాలని కోరారు.

శ్రమదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధి కామనూరు సమీపంలోని భగవాన్‌శ్రీ రామకృష్ణ పరమహంస ధ్యాన కేంద్రంలో వివేకానంద ఫౌండేషన్ సభ్యులు శ్రమదానం చేశారు. ఆవరణలోని పిచ్చి మొక్కలను, చెత్తను తొలగించి ధ్యాన కేంద్రాన్ని శుభ్రపరిచారు. వివేకానంద ఫౌండేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ధ్యాన కేంద్రంలో అందుబాటులో ఉన్న వివేకానంద సాహిత్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేతనాలు చెల్లించాలి

ప్రొద్దుటూరు : మున్సిపల్ క్లాప్ వాహన డ్రైవర్లకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ పి.పద్మావతిని కలిసి వేతన బకాయిలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తారన్న ఆశతో రూ.10వేలు డిపాజిట్ చెల్లించి క్లాప్ డ్రైవర్లు విధుల్లో చేరారని తెలిపారు. తక్కువ వేతనాలతో వారు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు నీటి సరఫరా బంద్

ప్రొద్దుటూరు : పట్టణంలోని పలు ప్రాంతాలకు ఆదివారం నీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్ నుండి బొల్లవరం రిజర్వాయర్ 1, 2, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ రిజర్వాయర్, సంజీవనగర్ రిజర్వాయర్లకు నీటిని పంపింగ్ చేసే 600 ఎంఎం డయా జీఆర్పీ పంపింగ్ లైన్‌కు పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మెగా ఇంజనీరింగ్ వర్క్స్ వారు నూతనంగా వేసిన పైపులైన్‌కు అనుసంధాన పనులు జరుగుతున్నాయని వివరించారు. దీని వలన బొల్లవరం, బుడ్డాయపల్లె, బొకరాపేట, వైఎస్సార్ నగర్, సూపర్ బజార్ రోడ్డు, కాళహస్తయ్య వీధి, హనుమాన్ నగర్, కుమ్మరకొట్టాలు, పఠాన్ కాలేజీ, ఎర్రన్నకొట్టాలు, డ్రైవర్‌కొట్టాలు, సరస్వతి విద్యా మందిరం రోడ్డు, కొర్రపాడు రోడ్డు, గోపిరైస్ మిల్ రోడ్డు, గోకుల్‌నగర్, శ్రీనివాసనగర్, స్వరాజ్యనగర్, సంజీవనగర్, కృపానగర్, ఆంధ్రకేసరి రోడ్డు తదితర ప్రాంతాలకు ఆదివారం నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

సీఎం పుట్టిన రోజున 4వేల గృహ ప్రవేశాలు

అధికారుల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజు సందర్భంగా డిసెంబర్ 21న 4వేల గృహ ప్రవేశాలు జరగాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. హౌసింగ్ శాఖ అధికారులతో మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత చంద్రబాబు ప్రభుత్వంలో సెంటు జాగా ఇవ్వలేదని, ఒక్క ఇల్లు మంజూరు చేయలేదన్నారు. వైఎస్ హయాంలో 500 ఎకరాల భూమి కొని అమృతానగర్ కాలనీని నిర్మించడం జరిగిందన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మున్సిపాలిటీ పరిధిలోని 41 వార్డులతోపాటు కొత్తపల్లె, గోపవరం, సోములవారిపల్లె, దొరసానిపల్లె గ్రామాలకు సంబంధించి 17వేలు ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి రూ.1.80లక్షలు మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం 200 ఎకరాల భూమి కొనుగోలు చేసి ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందన్నారు. డిసెంబర్ 21న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలనుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే 4వేల మందితో గృహ ప్రవేశాలు చేయించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. మరో ఆరేడువేల ఇళ్లు మార్చి నాటికి పూర్తి చేయిస్తామన్నారు. లబ్ధిదారులు ఇందుకు సహకరించాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కమిషనర్ వెంకటరమణయ్య, మున్సిపల్ ఇంజనీర్ సాయికృష్ణ, కౌన్సిలర్ పిట్టా బాలాజీ, మెప్మా టీఈ కెజియా జాస్లిన్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డీఈలు రామ్మోహన్‌రావు, గురుప్రసాద్, ఏఈ వెంకటేశ్వర్లు, కాంట్రాక్టర్లు, కౌన్సిలర్లు, సీఓలు పాల్గొన్నారు.

ఏ ప్రభుత్వంలో ఇంత అభివృద్ధి జరగలేదు

ఇంత వరకు గడిచిన ఏ ప్రభుత్వాల్లోనూ ఇంత అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు శాస్త్రినగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే రాచమల్లు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 41 వార్డుల్లో పూర్తిగా సిమెంటు రోడ్లు, డ్రైనేజి కాలువలు నిర్మించామన్నారు. ఎక్కడైనా రోడ్డు, కాలువలు లేవని ప్రజలు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించి నిర్మిస్తున్నామన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మున్సిపాలిటీలో రూ.100 కోట్లకుపైగా అభివృద్ధి పనులు చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వార్డు కౌన్సిలర్ ద్వార్శల భారతి, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, ద్వార్శల గురునాథరెడ్డి, ప్రిన్సిపాల్ త్రివిక్రమ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం

ప్రొద్దుటూరు మండలంలోని సోములవారిపల్లె పంచాయతీ ఈశ్వర్‌రెడ్డి నగర్‌లో చర్చి 5వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రభువు సూచించిన మార్గంలో పయనించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను చర్చి సంఘ పెద్దలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, సోములవారిపల్లె మాజీ సర్పంచ్ గోపిరెడ్డి రమణయ్య, ఆర్‌సీపీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, లాయర్ జీవీ సుబ్బయ్య, ఈశ్వర్‌రెడ్డినగర్ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తొందరపాటు నిర్ణయాలు తీసుకోరాదు


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మైనుద్దీన్

చాపాడు : చదువుకునే విద్యార్థులు చిన్నచిన్న విషయాలకు తొందరపాటు నిర్ణయాలు తీసుకోరాదని సబ్ ఇన్‌స్పెక్టర్ మైనుద్దీన్ పేర్కొన్నారు. స్థానిక సీబీఐటీ కాలేజీలో శుక్రవారం దిశ మహిళా రక్షణ - భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని, చదుకునే సమయంలో ఏర్పడే చిన్నచిన్న విషయాలు తొందరపాటు చర్యలు తీసుకోరాదన్నారు. క్రమం తప్పకుండా దినపత్రికలు చదువుతూ సమాజంలో జరిగే విషయాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన దిశ చట్టాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. విద్యార్థినిలందరూ తమ సెల్ ఫోనులలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోని ఆపద సమయాల్లో వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులను ఇతరులు ఎవరైనా ఇబ్బంది పెడితే సెక్షన్ 354, 509 ప్రకారం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే క్రమంలో సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు, ఏటీఎం వివరాలు ఇతరులకు ఇవ్వరాదని సూచించారు. కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

దువ్వూరు : మైదుకూరులో ఈనెల 20న జరుగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. దువ్వూరులోని సీవీవీ కల్యాణ మండపంలో సామాజిక సాధికార బస్సు యాత్రపై వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. గడప గడపకూ తిరిగి ప్రజలకు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించడమే కాక వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించామన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించి న్యాయం చేశామని చెప్పారు. సామాజిక బస్సు యాత్ర సమావేశానికి ప్రతి గ్రామం నుంచి ప్రభుత్వం నుండి లబ్ధి పొందిన ప్రజలందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిరాకి బాషా, నాయకులు వీవీ స్వామి, హరినాథరెడ్డి, కోగటం వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధా

అట్లూరు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా తెలిపారు. కుంభగిరి సచివాలయ పరిధిలో ఎస్ .వెంకటాపురంలోని మల్లినేనిపట్నం, బెడుసుపల్లి, తూడూరు, ఎగువపల్లి, చెండువాయి, రంగంపల్లి, చెన్నేపల్లి, ఉప్పుటూరు, గంగానగరం కాలనీలలో శుక్రవారం ఆమె గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. కార్యక్రమంలో అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టరు రొండా మల్లికార్జునరెడ్డి, మండల కన్వీనరు ముడమాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనరు మణ్యం మల్లికార్జునరెడ్డి, స్థానిక సచివాలయ కన్వీనరు వెంకటసుబ్బారెడ్డి, సర్పంచు గంగమ్మ, ఎంపీటీసీ సభ్యుడు చిన్నా, మండల వైస్సార్‌సీపీ నాయకులు రెడ్డెయ్య, వేణుగోపాల్‌రెడ్డి, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై జాగ్రత్తలు తప్పనిసరి


డమ్ములో నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

పోరుమామిళ్ల : దోమల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన రంగసముద్రం పంచాయతీ పరిధిలో తనిఖీలు నిర్వహించారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కార్యక్రమంలో భాగంగా ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. బాలికల ఆరోగ్య పరిస్థితి, ఫీవర్ కేసులు, పరిసరాల పరిశుభ్రత, బాత్‌రూమ్స్, బెడ్ రూమ్స్ తదితరాల గురించి వార్డన్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచ్చబండ కార్యక్రమంలో కీటక జనిత రోగాల గురించి అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమల నియంత్రణ, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, వైరల్ ఫీవర్ తదితర వ్యాధుల గురించి వివరించి, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా చూడాలన్నారు. ఇంటింటికీ వెళ్లి లార్వా ఉన్న ప్రదేశాలు గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. డ్రమ్ముల్లో నిలువ చేసిన నీటిని పారబోశారు. కార్యక్రమంలో అట్లూరు సీహెచ్ఓ మురళీకృష్ణ, బద్వేలు హెచ్ఈ వెంగయ్య, సీహెచ్ఓ చిన్నపుల్లయ్య, పోరుమామిళ్ల హెచ్ఈ వెంకటేశ్వర్లు, హెచ్ఎస్ శివరామిరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఘనంగా ఊరేగింపు


శ్రీరాముని అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళుతున్న వీహెచ్‌పీ నాయకులు

అయోధ్య నుంచి శ్రీరాముని పూజించిన అక్షింతలు శుక్రవారం ప్రొద్దుటూరుకు తీసుకొచ్చారు. ఈ అక్షింతలను అమ్మవారిశాల నుంచి మేళ తాళాలతో గీతాశ్రమంకు తీసుకెళ్లారు. చిన్మయ మిషన్ మాతాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చీతిరాల నాగార్జునరావు, మారెళ్ల మల్లికార్జునరావు, నగర కార్యదర్శి నాగమునిరెడ్డి, బీజేపీ పట్టణాధ్యక్షుడు వంకధారి నరేంద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ప్రదీప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి భాస్కర్ రెడ్డితోపాటు రవీంద్ర స్కూల్ కరస్పాండెంట్ పల్లేటి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. – ప్రొద్దుటూరు

దీక్షను జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు : కృష్ణా జలాల పునఃపంపిణీకి వ్యతిరేకంగా ఈనెల 27, 28న విజయవాడలో చేపట్టే 30 గంటల దీక్షలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సమితి సభ్యులు రామకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణాలో జరిగే ఎన్నికల దృష్ట్యా రాజకీయ లబ్ధి కోసం కృష్ణా జలాలను తెలంగాణ వారికే పూర్తి హక్కులు అన్నట్లు ఇవ్వడం దుర్మార్గమన్నారు. దీనిని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించనున్న జల దీక్షలలో జిల్లా వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణకు కృషి చేయాలి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బందితో పాటు ఆయా సచివాలయాల శానిటేషన్ సెక్రటరీలు పట్టణ సుందరీకరణకు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బంది, సచివాలయాల శానిటేషన్ సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా పట్టణంలోని ప్రధాన రహదారుల్లో గల వ్యాపార సముదాయాలు చెత్తను రోడ్లపై వేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆయా వార్డుల్లో స్పెషల్‌డ్రైవ్ పేరుతో డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించి చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపాలిటీ సిబ్బందికి అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలో ఎక్కడా కూడా పారిశుధ్య సమస్య తలెత్తకుండా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. స్వచ్ఛబద్వేలు ఏర్పాటుకు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తా శ్రీరాములు, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, కౌన్సిలర్ సత్యనారాయణ, వార్డు ఇన్‌చార్జిలు సుబ్బారెడ్డి, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భాషా పరిజ్ఞానం పెంపొందించుకోవాలి


మైదుకూరు : వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రొద్దుటూరు : భాషా పరిజ్ఞానం పెంపొందించుకోవాలని రచయిత జింకా సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక అనిబిసెంట్ ఆవరణలోని పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో శుక్రవారం కవులు, రచయితల స్మరణ కార్యక్రమంలో భాగంగా గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన గురజాడ అప్పారావు రచించిన కావ్యాలను, ఆయన గొప్పదనాన్ని వివరించారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం జింకా సుబ్రహ్మణ్యం, హోమస్‌పేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ రవీంద్రుడును సన్మానించారు.

వ్యాసరచన పోటీలు

రాజుపాళెం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శక్రవారం రాజుపాళెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాలు, వాటి ఉపయోగాలు, నీతి కథ రాయడంపై గ్రంథాలయ అధికారి ఎస్.ప్రతాపుడు వ్యాసచరన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం చంద్ర ఓబుళరెడ్డి, ఉపాధ్యాయుడు రమేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

అట్లూరు : గ్రంథాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రాంథాలయ అధికారి ఎం.సుధాకర్, తెలుగు పండిట్ గౌరీశంకర్‌లు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం 4, 5 తరగతి విద్యార్థులకు కవుల గురించి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఐవారయ్య, వెంకటయ్యలు పాల్గొన్నారు.

మైదుకూరు : మండలంలోని వనిపెంట జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహించినట్లు వనిపెంట గ్రంథాలయ నిర్వాహకురాలు ఎస్.పార్వతి తెలిపారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులను అందజేస్తామని ఆమె పేర్కొన్నారు.

విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభం


పూజ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వపు మఠాధిపతి కుమారులు


విద్యుత్ దీప కాంతుల్లో పోలేరమ్మ ఆలయం

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన బ్రహ్మంగారి మఠంలో శ్రీ పోలేరమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా యాగశాల ఏర్పాటు చేసి, హోమాలు నిర్వహించారు. గణపతి పూజ, అభిషేకాలు, అఖండ ప్రతిష్టాపన, ప్రధాన కలశస్థాపన, పరివార దేవతార్చనలు తదితర కార్యక్రమాలు నిర్వహించి, అంకురార్పణ చేశారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంత వేంకటేశ్వర స్వామి కుమారులు శ్రీ ఎస్.వెంకటాద్రిస్వామి, శ్రీ ఎస్.వీరభద్రస్వామి, ఎస్.వీరంభట్లయ్యస్వామి, ఎస్.దత్తాత్రేయస్వామి ఉత్సవాలు ప్రారంభించారు. శతాధిక ప్రతిష్టాపనాచార్య, గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఇడమకంటి జనార్ధన శివాచార్య ఆధ్వర్యంలో వేలూరుకు చెందిన జ్యోతి మురుగాచార్య, పోలేపల్లె రామబ్రహ్మం, యలవర్తి ఆంజనేయశాస్త్రి వేద సంస్కృత పాఠశాల పూర్వపు శిష్య బృందం, మఠం ఆలయ అర్చకులు ఉదయం, సాయంత్రం విశేష పూజలు చేశారు. తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన శ్రీ నటరాజ నాట్య కళాబృందం వారు నిర్వహించిన 'శ్రీ సిద్ధయ్యగారి జ్ఞానమార్గం' సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది.

● శ్రీ పోలేరమ్మవారి విగ్రహాన్ని ప్రొద్దుటూరు నుంచి బ్రహ్మంగారిమఠానికి తెచ్చి శ్రీవీరబ్రహ్మేంద్రస్వాముల వారి మఠంలోని గణపతి మంటపంలో గురువారం రాత్రి ధాన్యంలో ఉంచారు. శుక్రవారం ఉదయం పోలేరమ్మ గుడి వద్దకు తీసుకొచ్చి పూజా కార్యక్రమాల్లో కొలువు దీర్చారు. రాత్రి భక్తుల సమక్షంలో జలాధివాస కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

కాంతులీనుతున్న ఆలయం

విద్యుత్ దీప కాంతులతో ఆలయం ధగధగలాడుతోంది. దేవుళ్ల, అమ్మవారుల ప్రతిమల ఆర్చరీలు ఆకట్టుకుంటున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా మఠం ఫిట్ పర్సన్ సి.శంకరబాలాజి, మేనేజర్ ఎస్.ఈశ్వరాచారి ఆధ్వర్యంలో మఠం అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక అలంకారంలో రామలింగేశ్వరస్వామి


ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి

పోరుమామిళ్ల : పట్టణంలోని పురాతన శివాలయం శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 14 నుంచి కార్తీక మాస ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం, సోమవారం అమ్మవారికి, స్వామికి ప్రత్యేక అలంకరణలు చేస్తున్నారు. శుక్రవారం అర్చకులు మధుస్వామి రామలింగేశ్వరస్వామికి, బాలాత్రిపురసుందరీదేవికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు తెల్లవారుజామునుండే దర్శనానికి వచ్చారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నుంచి పంచారామ క్షేత్రాలైన అమరావతి, సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ప్రతి ఆదివారం సాయంత్రం 5 గంటలకు సూపర్ లగ్జరి బస్సు డిపో నుండి బయలుదేరుతుందని, చార్జి రూ.2,500 అని పేర్కొన్నారు. కన్యతీర్థం, నైనాలప్ప, యాగంటి, నందవరం, మహానంది క్షేత్రాలకు ప్రతి సోమవారం ఉదయం 5 గంటలకు డిపో నుండి ఎక్స్‌ప్రెస్ బస్సు బయలుదేరుతుందని, చార్జి రూ.500 ఉంటుందన్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ఆర్టీసీ డిపో నుంచి బస్సు బయల్దేరి మహానంది, ఓంకారం దర్శించుకుని, రాత్రి శ్రీశైలం చేరుతుందని, సోమవారం ఉదయం శ్రీశైలంలో స్వామిని దర్శించుకుని అనంతరం తిరుగు ప్రయాణం ఉంటుందని, ఎక్స్‌ప్రెస్ బస్సు చార్జి రూ.990 అని వివరించారు. ఈ సర్వీసులకు రిజర్వేషన్ కోసం 9966525210 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు


రథోత్సవంలో అయ్యప్పస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పెన్నానదీతీరంలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అయ్యప్ప స్వామి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తిని రథంపై ఉంచి ఊరేగించారు. లోకకళ్యాణార్థం గణపతి, నవగ్రహ, శ్రీధర్మశాస్త హోమాన్ని నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. పలువురు భక్తులు అయ్యప్పస్వామి దీక్షను స్వీకరించారు.

ఆకట్టుకున్న గీతాలాపన


భక్తిగీతాలను ఆలపిస్తున్న పార్వతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో నామా ఎరుకలయ్య, కమాలక్షుమ్మ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి జీ సరిగమ ఫేమ్ పార్వతి ఆలపించిన గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఆమె అన్నమాచార్య కీర్తనలు, భక్తి పాటలు ఆలపించి అందరిని అలరించారు. ఎర్రగుంట్లకు చెందిన నడి ఊరు రామాలయం భజన బృందం తాళాల హరి భజన చేశారు. మధ్యాహ్నం విజయేశ్వరి వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కాగా శనివారం సనాతన ధర్మంపై పసుపులేటి శంకర్ ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తారని, భక్తులు పాల్గొనాలని దేవాదాయశాఖ ఏసీ శంకర్ బాలాజీ కోరారు.